క్లుప్తంగా

శక్తి యాప్ మహిళలకు వరం



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న శోభ

పీలేరురూరల్ : రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన శక్తి యాప్ మహిళలకు వరంలాంటిదని శక్తి టీమ్ సభ్యురాలు శోభ అన్నారు. గురువారం స్థానిక సంజయ్‌గాంధీ డిగ్రీ కళాశాలలో శక్తి యాప్‌పై విద్యార్థినులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బాలికలను, మహిళలను రక్షించుకోవాల్సిన, గౌరవించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. మహిళల రక్షణ కోసం ప్రభుత్వం శక్తి యాప్ తీసుకొచ్చిందని, ప్రతి ఒక్కరూ డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదు



పోలీసులకు సూచనలిస్తున్న ఎస్ఐ

తంబళ్లపల్లె: విధి నిర్వహణలో నిర్లక్ష్యం తగదని ఎస్.ఐ లోకేష్‌రెడ్డి అన్నారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్‌లో సమీక్ష సమావేశం నిర్వహించారు. విధుల నిర్వహణపై ఆరా తీశారు. మండలంలో ఎక్కడ అసాంఘిక కార్యకలాపాలు జరిగినా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఫిర్యాదు దారులతో స్నేహభావంతో మెలిగాలని పేర్కొన్నారు. ప్రజల సహకారంతోనే శాంతిభద్రతల పరిరక్షణ సాధ్యమవుతుందన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ మహేశ్వరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

పీలేరు : మండలంలోని శివరామపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు విద్యా సామగ్రి, క్రీడాసామగ్రి పంపిణీ చేశారు. స్థానిక సొసైటీ బ్యాంకు అడ్వైజర్ రాజేంద్ర ఆచారి కుమార్తె సుమలత అమెరికాలో ఉన్నారు. ఆమె ఏబీసీ సొసైటీ తరఫున శివరామపురం ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వివిధ గేమ్స్ నిర్వహించి బహుమతులు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ లోకేశ్వర్‌రెడ్డి, హెచ్ఎంలు శోభారాణి, కృష్ణమూర్తి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్ల నిర్మాణ పనులు తనిఖీ

మదనపల్లె: మండలంలో జరుగుతున్న సీసీ రోడ్ల నిర్మాణాలను గురువారం అధికారులు తనిఖీ చేశారు. పీఆర్‌డీఈ శివప్రసాద్, ఎంపీడీఓ తాజ్ మసూర్, మండలంలోని కొత్తపల్లి పంచాయతీ ఈశ్వరమ్మ కాలనీలో పంతొమ్మిది లక్షల రూపాయలతో నిర్మాణం చేస్తున్న సీసీ రోడ్డు పనులను తనిఖీ చేశారు. అదేవిధంగా కోళ్ల బైలు టు పంచాయతీ జామకాయల తోట కాలనీలో రూ. 5 లక్షలతో చేపట్టిన సీసీ రోడ్డు పనులను ప్రారంభించారు. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యతతో చేయాలని కాంట్రాక్టర్లను ఆదేశించారు. నిర్మాణ పనుల అనంతరం వాటర్ క్యూరింగ్ సక్రమంగా చేయాలన్నారు. అనంతరం ఎంపీడీఓ తాజ్మస్రూర్ ఈశ్వరమ్మ కాలనీలో రూ.5.30 లక్షలతో నూతనంగా వేసిన పైప్ లైన్ నిర్మాణంతోపాటు, బోరుకు మోటర్ అమర్చి స్థానికంగా తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. కార్యక్రమంలో పీఆర్ఏఈ రమణ పంచాయతీ కార్యదర్శి గిరిధర్ నాయక్ పాల్గొన్నారు.

రంజాన్ తోఫా పంపిణీ

మదనపల్లె సిటీ: పవిత్ర రంజాన్‌మాసం పురస్కరించుకుని మదనపల్లె పట్టణం నీరుగట్టువారిపల్లెలో గురువారం చేనేత సంఘ రాష్ట్ర నాయకుడు ఓర్సు వీరభాస్కర్ ముస్లింలకు రంజాన్ తోఫాను అందజేశారు. ఎంతో నియమనిష్టలతో రంజాన్‌లో ఉపవాసాలు ఉన్నవారు రంజాన్ పండుగ సంతోషంగా చేసుకోవాలన్న ఉద్దేశంతో రంజాన్‌తోఫా అందజేశామన్నారు. కార్యక్రమంలో చేనేత సంఘ నాయకులు రమేష్, షేక్‌జాన్, శీనప్ప, రమేష్ పాల్గొన్నారు.

డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి

మదనపల్లె సిటీ: తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలను పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు శ్రీనివాసులు, కోశాధికారి హరిశర్మ డిమాండ్ చేశారు. గురువారం తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమావేశంలో స్థానిక జిల్లా ఆస్పత్రి వద్ద జరిగింది. తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్ల సమస్యలు చాలా తీవ్రంగా ఉన్నాయన్నారు. వారికి సరైన వేతనాలు కూడా ఇవ్వలేదన్నారు. డ్రైవర్ల అందరికీ సమాన పనికి సమానం వేతనం ఇవ్వాలన్నారు. సీఐటీయూ నాయకులు నాగరాజు, తల్లిబిడ్డ ఎక్స్‌ప్రెస్ డ్రైవర్లు కృష్ణప్ప, గంగాధర్, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం సద్వినియోగం చేసుకోండి

పీలేరురూరల్ : వేసవిలో ప్రజల దాహార్తి తీర్చడానికి ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఎం. భీమేశ్వర్‌రావు సూచించారు. గురువారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత ఎక్కువ ఉందని, దాతలు ముందుకొచ్చి ప్రధాన కూడళ్లలో చలివేంద్రాలు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వీఆర్వో హేమంత్ నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

మాహె రంజాన్.. అల్‌విదా

- నేడు జుమతుల్ విదా
- ముస్తాబైన ఈద్గాలు, మసీదులు



విద్యుత్‌దీపాల వెలుగులో మదనపల్లెలోని జామియా మసీదు

మదనపల్లె సిటీ : పవిత్ర రంజాన్ మాసానికి వీడ్కోలు పలికే చివరి శుక్రవారం జుమతుల్ విదా. జుమా అనగా శుక్రవారం. విదా అనగా వీడ్కోలు. దీనిని పురస్కరించుకుని జిల్లాలోని అన్ని మసీదులలోనూ శుక్రవారం ముస్లింలు ప్రత్యేక ప్రార్థనలు చేయనున్నారు. ఇస్లాం కామానంలోని ఎనిమిదవ నెలయిన షాబాన్30వ తేదీన రంజాన్ నెలవంకను దర్శించుకుని మరుసటి రోజు నుంచి 30 రోజుల పాటు ముస్లింలు అత్యంత నిష్ఠతో కఠోర ఉపవాసదీక్షలు చేపడుతారు. అనంతరం రంజాన్ మాసంలోని 30వ తేదీన షవ్వాల్ నెలవంక దర్శించుకుని మరుసటి రోజు ఈద్-ఉల్-ఫితర్ పర్వం జరుపుకుంటారు. ఇస్లాంలో శుక్రవారం ఎంతో పవిత్రమైనది. మహోన్నతమైనది. అందులోనూ రంజాన్ మాసంలోని శుక్రవారానికి మరింత పవిత్రంగా భావించి ప్రార్థనలు చేస్తారు. ఈ పవిత్ర రంజాన్ మాసంలో సంభవించే చివరి శుక్రవారం జుమతుల్ విదా. రంజాన్ మాసానికి వీడ్కోలు పలికే శుక్రవారంగా పరిగణించి మసీదులలో ప్రత్యేక ప్రార్థనలు చేస్తారు. ఒకవైపు 30 రోజుల పాటు ఉపవాసాలు ముగించుకుని రంజాన్ పర్వదినం రానుందన్న సంతోషం వ్యక్తం చేస్తూనే.. మరో వైపు పవిత్రమైన రంజాన్ మాసం పూర్తికానుండటంతో బాధపడుతూ పవిత్ర మాసానికి వీడ్కోలు పలుకుతారు.

ఆత్మశాంతి కోసం ప్రార్థనలు

పవిత్ర రంజాన్ మాసంలోని జుమతుల్ విదాను పురస్కరించుకుని ప్రత్యేక ప్రార్థనలు చేయడానికి అనుగుణంగా మసీదులను ప్రత్యేకంగా ముస్తాబు చేశారు. మసీదుల వద్ద అధ్యాత్మిక వాతావరణం నెలకొంది. మసీదులలో ఖాజీలు, ఉలేమాలు, మత పెద్దలు, ధార్మికోపన్యాసంచేస్తూ జుమతుల్ విదా విశిష్టతను తెలియజేస్తారు. ముస్లింల ఖబరస్థాన్‌కు వెళ్లి పూర్వీకుల ఆత్మశాంతి కోసం ప్రార్థనలు చేస్తారు.

పుణ్యఫలాల వరప్రసాదిని జుమతుల్ విదా



రంజాన్ మాసంలోని చివరి శుక్రవారం జుమతుల్ విదా. దీనిని పుణ్యఫలాల వరప్రసాదినిగా కూడా పేర్కొంటారు. రంజాన్ మాసంలో చేపట్టిన ప్రార్థనలు, ఉపవాసాలకుగాను దైవం పుణ్యఫలాలను ప్రసాదిస్తుంది. నెల రోజులుగా చేపట్టిన ఉపవాసాలు, ప్రార్థనలు ఏ మేరకు పాటించామో విశ్లేషించుకుని అందులో ఏమైనా పొరపాట్లు జరిగి ఉంటే అల్లాహ్ దగ్గర క్షమాపణలు కోరుకోవాలి. అలాగే సామూహికంగా విశ్వ మానవాళి సంతోషం కోసం ప్రార్థనలు చేయాలి. దివ్యఖురాన్ పారాయణం, జిక్ర్, ప్రత్యేక ప్రార్థనలు చేయాలి.

-మౌలానా జలాలుద్దీన్‌సాహెబ్, ప్రభుత్వ ఖాజీ, మదనపల్లె

పేదలను ఆదుకోవాలి



ఆర్థిక స్తోమత కలిగినవారు జకాత్, ఫిత్రా రూపంలో పేదలకు దాన, ధర్మాలు చేయాలి. రంజాన్ పండుగకు ముందుగానే ధాన ,ధర్మాలు చేసి పేదలూ కూడా రంజాన్ పండుగ సంతోషంగా జరుపుకునేందుకు జకాత్, ఫిత్రా దోహదపడాలి. పేదరికం లేని సమాజ నిర్మాణమే రంజాన్ లక్ష్యం.

-హాజీ పఠాన్ అక్బర్‌ఖాన్, మదనపల్లె

ప్రజా సమస్యలపై దృష్టి పెడదాం

ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి



కొండకిందకురవపల్లిలో పర్యటిస్తున్న ద్వారకనాథరెడ్డి

బి.కొత్తకోట: ప్రజా సమస్యల పరిష్కారం కోసం కృషి చేయాలని, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి పిలుపునిచ్చారు. గురువారం ఆయన మండలంలోని బండారువారిపల్లి పంచాయతీ కొండకిందకురవపల్లిలో పర్యటించారు. మండలానికి చెందిన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యేను కలిశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ పాలనలో బండారువారిపల్లి పంచాయతీలో మట్టిరోడ్లను తారురోడ్లుగా అభివృద్ధి చేశామని గుర్తు చేశారు. దశాబ్దాలుగా కనీస రహదారులులేని పంచాయతీలో ప్రస్తుతం అన్నిపల్లెలు కలుపుతూ సుందరమైన తారురోడ్లను నిర్మించినట్టు చెప్పారు. ప్రస్తుతం ప్రజలు ఎదుర్కొంటున్న ఇంటిస్థలాలు, పక్కా గృహాల మంజూరు, పింఛన్లు, రేషన్‌కార్డుల సమస్యలపై స్థానిక నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసుకుని అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ బీసీ విభాగం జిల్లా అధ్యక్షుడు సాంబశివ, నాయకులు పాల్గొన్నారు.

ఇంటి స్థలాల ఆక్రమణపై నిరసన



నిరసన వ్యక్తం చేస్తున్న రజకులు

మదనపల్లె: తమకు ఇంటి స్థలాలు మంజూరు చేసేందుకు ప్రభుత్వం కేటాయించిన భూమిలో ఇతరులు ఆక్రమించేందుకు ప్రయత్నించడంతో రజకులు నిరసనకు దిగారు. గురువారం పట్టణంలోని బీకేపల్లె రెవిన్యూ గ్రామంలో రజకులకు కేటాయించిన ఇళ్ల స్థలాలను కొందరు ఆక్రమించేందుకు యత్నించడంతో పాటు, చుట్టూ నిర్మించిన కూసాలను పెకిలించే ప్రయత్నం చేయడం, సిమెంటు దిమ్మెలు ధ్వంసం చేయడంపై రజకులు నిరసన వ్యక్తం చేశారు. బీకేపల్లె కాలని సర్వే నంబర్ 513లో రజకుల ఇళ్ల స్థలాలకు కేటాయించిన 1.72 ఎకరాల స్థలం చుట్టూ నిర్మించిన కంచె, ఏర్పాటు చేసిన సిమెంటు దిమ్మెలను కొందరు వ్యక్తులు ధ్వంసం చేశారు. దీంతో విషయం తెలుసుకున్న శ్రీవేంకటేశ్వర రజక సంఘం నాయకులు అక్కడికి చేరుకుని అభ్యంతరం తెలిపారు. అయితే ఆక్రమణకు యత్నించిన వ్యక్తులు వారిని కులం పేరుతో దూషించడంతో పాటు దౌర్జన్యం చేశారు. దీంతో బాధితులు సంఘటనా స్థలం వద్ద నిరసనకు దిగారు. ఎమ్మెల్యే షాజహాన్ బాషాకు ఫిర్యాదు చేశామని బాధితులు తెలిపారు. ఆయన తహసీల్దార్‌తో మాట్లాడి, స్థలం వద్దకు వెళ్లి రికార్డులు పరిశీలించి రజకులకు న్యాయం చేయాలని ఆదేశించారని చెప్పారు. కార్యక్రమంలో రజక సంఘం నాయకులు ఎం. నాగయ్య, వెంకటరమణ, రామ్మూర్తి, మునిరత్నం, అరుణ, మంజుల, సుజాత, నందిని పాల్గొన్నారు.

డ్వాక్రా మహిళల ఆర్థిక సమస్యల పరిష్కారానికి ప్రణాళికలు



మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ

మదనపల్లె : డ్వాక్రా మహిళల ఆర్థిక అవసరాలకు పరిష్కారం చూపే దిశగా, వారికి అవసరమైన మేరకు రుణాలు అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు డీఆర్‌డీఏ పీడీ సత్యనారాయణ పేర్కొన్నారు. గురువారం స్థానిక వెలుగు కార్యాలయంలో 2025-26 ఏడాదికి స్వయం సహాయక సంఘాలకు వార్షిక ఆదాయం, జీవనోపాధుల కల్పనకు, ప్రణాళికల తయారీపై డివిజన్ స్థాయి శిక్షణ కార్యక్రమం జరిగింది. ఆయన మాట్లాడుతూ డ్వాక్రా సంఘాల సభ్యులకు జీవనోపాధి కోసం ఏ మేరకు రుణాలు అవసరం, సభ్యులు ఏ వత్తిలో ఉన్నారు, ఎంత మేరకు రుణాలు అవసరం, తదితర వివరాలు పరిశీలించి నివేదికలు తయారు చేయాలన్నారు. నెలవారీగా ఎంత రుణం అవసరం అవుతుందో గుర్తించాలన్నారు. బీపీఎం లక్ష్మిప్రసాదరెడ్డి, వేణుమాధవ్ నాగార్జున జండర్ ఏపీఎం కిజర్ హయత్ ఖాన్, ఏపీఎం సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

చెట్టుపై నుంచి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

మదనపల్లె: చెట్టుపై నుంచి పడి ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. గురువారం మదనపల్లె మండలం పోతబోలు పంచాయతీ కురవపల్లికు చెందిన రాజ్ కుమార్ (30) కొబ్బరి చెట్టు నుంచి కాయలు దించేందుకు కూలీకి వెళ్లాడు. చెట్టు ఎక్కి కాయలు కోస్తుండగా ప్రమాదశాత్తు కిందపడి తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు బాధితుడిని వెంటనే ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. అత్యవసర విభాగంలో చికిత్సలు అందించినా పరిస్థితి విషమంగా ఉండటంతో తిరుపతికి రెఫర్ చేశారు.

పీలేరు పంచాయతీకి రూ. 42.86 లక్షల ఆదాయం



వేలంపాట నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజ

పీలేరు : పీలేరు గ్రామ పంచాయతీకి వేలం పాట ద్వారా మదనపల్లె డీఎల్‌పీఓ నాగరాజ తెలిపారు. గురువారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఏడాదికి కాలానికి వారపుసంత, దినసరి కూరగాయాల మార్కెట్, జంతువధ శాల, ప్రయివేట్ బస్టాండ్ గేటు వసూలు హక్కుకు వేలం పాట నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్చు పాటదారులు వారపుసంతను అశోక్‌రెడ్డి రూ. 28.25 లక్షలు దక్కించుకున్నారు. దినసరి కూరగాయల మార్కెట్ రూ. 5.55 లక్షలు, జంతువధశాల రూ. 3.02 లక్షలు, ప్రైవేట్ బస్టాండ్ రూ. 6.02 లక్షలకు హెచ్చుపాట దారులు దక్కింకున్నారు. వేలంపాట సందర్భంగా కొంత ఉద్రిక్తత నెలకొంది. వేలం పాట దారుల మధ్య ఘర్షణ చోటు చేసుకుంది. పోలీసుల బందోబస్తు మధ్య వేలంపాట నిర్వహించారు. సర్పంచ్ హబీబ్‌బాషా, ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్, ఈవో గురుమోహన్ పాల్గొన్నారు.

కురబలకోట: మండలంలోని ముదివేడు వారపు సంత గేటు వేలం పాట రికార్డు స్థాయిలో జరిగింది. గురువారం స్థానిక పంచాయతీ కార్యాలయంలో జరిగిన వేలం పాటలో రూ. 5,63,000 పలికింది. నౌషాద్ అనే వ్యక్తి దక్కించుకున్నారు. ఈ ఆదాయాన్ని గ్రామంలో తాగునీటి అవసరాలకు వినియోగించాలని ఎంపీడీఓ గంగయ్య సూచించారు.

మండల అభివృద్ధే లక్ష్యం

పీలేరు : పీలేరు మండల అభివృద్ధే లక్ష్యంగా పని చేస్తామని మండల కో- ఆప్షన్ సభ్యుడు సయ్యద్‌బాషా అన్నారు. పీలేరు మండల కో-ఆప్షన్ సభ్యుడిగా వైఎస్సార్‌సీపీకి చెందిన సయ్యద్‌బాషా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. పీలేరు మండల కో- ఆప్షన్ సభ్యుడుగా ఉన్న రెడ్డిబాషా మృతి చెందడంతో కొన్ని నెలలు ఈ పదవి ఖాళీగా ఉంది. గురువారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పీలేరు మండల కో-ఆప్షన్ సభ్యుడు పదవికి ఎన్నికల రిటర్నింగ్ అధికారి అమరనాథరెడ్డి ఆధ్వర్యంలో ఎన్నికలు నిర్వహించారు. వైఎస్సార్‌సీపీకి చెందిన ఎంపీటీసీ సభ్యులు మేజార్టీగా ఉండడంతో రెడ్డిబాషా కుమారుడైన సయ్యద్‌బాషాను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం సయ్యద్ బాషాతో ప్రమాణ స్వీకారం చేపించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కంభం సతీష్‌రెడ్డి, వైస్ ఎంపీపీ చలపతి, ఎంపీడీవో శివశంకర్, ఏవో రాజేశ్వరి, ఎంపీటీసీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

సారూ.. ఆక్రమణలు తొలగించండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న ముడియంవారిపల్లె గ్రామస్తులు

కలకడ : ప్రభుత్వం మంజూరు చేసిన ఇల్లు కొనుగోలు చేశామని చెబుతూ తమ ఇంటికి ఏర్పాటు చేసిన దారిని ఆక్రమించారని, తమకు న్యాయం చేయాలని ఓ బాధితుడు తహసీల్దార్‌ను వేడుకున్నాడు. గురువారం తహసీల్దార్ పనికుమార్‌కు మండలంలోని ముడియంవారిపల్లె గ్రామానికి చెందిన తిరుపతి లింగయ్య కుమారుడు లక్ష్మీపతి కథనం మేరకు.. ముడియంవారిపల్లె గ్రామం సమీపంలోని సర్వే నంబర్ 93లో తన తల్లి లక్ష్మమ్మ పేరుతో 2018లో ప్రభుత్వం ఇల్లు మంజూరు చేయగా ఇల్లు నిర్మించుకున్నామని తెలిపాడు. ప్రభుత్వం బీసీ కాలనీకి మంజూరు చేసిన పట్టా ప్రకారం గ్రామ కంఠం భూమిలో అనేక మందికి ఇంటి నిర్మాణం కోసం ప్రభుత్వం పట్టాలు మంజూరు చేసినట్లు తెలిపారు. అయితే అదే గ్రామానికి చెందిన వ్యక్తులు వీధి చివరిలో నలుగురి ఇంటిస్థలాలు కొనుగోలు చేసి దారిని ఆక్రమించారని వాపోయాడు. దీంతో తమ ఇంటికి, పొలానికి దారి లేకుండా మూసేశారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ దారి సమస్యపై స్పందించిన తహసీల్దార్ వెంటనే పరిశీలించి ఆక్రమణ దారులకు నోటీసులు ఇవ్వాలని వీఆర్‌ఓను ఆదేశించారు.

కూలీలకు వంద శాతం పనులు కల్పించాలి

మదనపల్లె : ఉపాధి హామీ కూలీలకు 100 శాతం పనులు కల్పించాలని ఎంపీడీవో తాజ్ మస్రూర్ అన్నారు. గురువారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. 2025-2026 ఆర్థిక సంవత్సరంలో ఉపాధి హామీ కూలీలకు పూర్తిస్థాయిలో పనులు కల్పించేందుకు అవసరమైన చర్యలు తీసుకోవాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి పనులను గుర్తించాలన్నారు. కందకాలతవ్వకం, జంగిల్ క్లియరెన్స్, చెరువులలో పూడికతీత, తదితర పనులతో పాటు, హౌసింగ్ పనులు చేపట్టాలన్నారు. మండలంలో ప్రతిరోజు 1460 మంది కూలీలు పనిచేసేలా క్షేత్రస్థాయి సిబ్బంది ప్రణాళిక బద్ధంగా చర్యలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో ఉపాధి హామీ ఎపిఓ చెన్నకేశవ, పి ఆర్ ఏ ఈ రమణ, టెక్నికల్ అసిస్టెంట్లు బోయ కొండప్ప చిన్నప్ప దివ్య భారతి తదితరులు పాల్గొన్నారు.

పోతబోలు హౌసింగ్ కాలనీలో రీ వెరిఫికేషన్

మదనపల్లె: మండలంలోని పోతబోలు హౌసింగ్ కాలనీలో తహసీల్దార్ ధనుంజయులు రీవెరిఫికేషన్ చేపట్టారు. గురువారం ఆర్ఐ శేషాద్రి రావు సిబ్బందితో కలిసి హౌసింగ్ కాలనీలోని ప్రతి ఇంటి వివరాలను పరిశీలించారు. ఇంటి పట్టాలు పొంది నిర్మాణాలు పూర్తి చేయని లబ్ధిదారుల వివరాలు సేకరించారు. అదేవిధంగా ఇంటి పట్టా పొంది ఇతరులకు విక్రయాలు జరిపిన లబ్ధిదారుల వివరాలను సేకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంటి పట్టా పొందిన లబ్ధిదారులు కచ్చితంగా నిర్మాణం పూర్తి చేయాలన్నారు. పనులు ప్రారంభించని ఇంటి స్థలాల పట్టాలను రద్దుచేసి, వాటిని అర్హులైన వారికి కేటాయిస్తామన్నారు. అనర్హుల ఏరివేతలో భాగంగానే హౌసింగ్ కాలనీలో రీ వెరిఫికేషన్ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

మాజీ మంత్రి పెద్దిరెడ్డిని కలిసిన చింతల



మాజీ మంత్రి పెద్దిరెడ్డితో మాజీ ఎమ్మెల్యే చింతల

కలికిరి(వాల్మీకిపురం): రాష్ట్ర మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డిని పీలేరు మాజీ ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి గురువారం తిరుపతిలోని మాజీ మంత్రి స్వగృహంలో మర్యాద పూర్వకంగా కలిశారు. మాజీ మంత్రి పెద్దిరెడ్డి గాయపడ్డారు. దీంతో అయన ఆరోగ్యంపై విచారించి పరామర్శించారు. అలాగే పీలేరు నియోజకవర్గంలో వైఎస్సార్‌సీపీ స్థితిగతులు, పార్టీ కమిటీల ఏర్పాటు, కూటమి ప్రభుత్వ దౌర్జన్యాలు, అక్రమాలపై మాజీ మంత్రితో చర్చించినట్లు మాజీ ఎమ్మెల్యే చింతల తెలిపారు. పార్టీ బలోపేతం, ప్రభుత్వం అవలంభిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఈ సందర్భంగా మాజీ మంత్రి తెలిపినట్లు పేర్కొన్నారు. మాజీ ఎమ్మెల్యే వెంట వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు చింతల ఆనందరెడ్డి, వాల్మీకిపురం మాజీ సర్పంచ్ బిడ్డల కేశవరెడ్డి పాల్గొన్నారు.

మహిళలు పురుషులతో సమానం

గుర్రంకొండ: మహిళలు పురుషులతో సమానమని తెలుగు జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు మదన్‌మోహన్ అన్నారు. మహిళా సాధికారితలో పురుషుల పాత్ర అన్న అంశంపై గుర్రంకొండ పోలీసుల ఆధ్వర్యంలో తెలుగు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ నేపథ్యంలో గురువారం వ్యాసరచన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మధు రామచంద్రుడు, హెడ్మాస్టర్ మదన్మోహన్ మాట్లాడుతూ బాలికలు ఉన్నత చదవులు చదవి మంచి పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యార్థునుల అన్ని రంగాల్లో రాణించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పీడీ రమేష్‌బాబు, ఉపాధ్యాయులు హర్షవర్ధన్‌రెడ్డి, త్రినాథ్ విద్యార్థులు పాల్గొన్నారు.

పగడాల ప్రవీణ్ మృతిపై విచారణ జరపాలి

మదనపల్లె: క్రైస్తవ బోధకులు పగడాల ప్రవీణ్ మృతిపై సమగ్ర విచారణ జరిపి దోషులపై కఠిన చర్యలు తీసుకోవాలని గురువారం సీఎస్ఐజే సీఎం చర్చి చైర్మన్ రెవరెండ్ డాక్టర్ సునీల్ కుమార్, సిపిఎం జిల్లా కార్యదర్శి పి. శ్రీనివాసులు డిమాండ్ చేశారు. వేరు వేరు కార్యక్రమాల్లో వారు మాట్లాడుతూ ఈ నెల 25న రాజమండ్రిలో పగడాల ప్రవీణ్ మృతి చెందిన ఘటనపై ప్రజల్లో అనేక అనుమానాలున్నాయన్నారు. ప్రవీణ్ క్రైస్తవ మత ప్రచారం చేస్తున్నాడనే కారణంతో కొంతమంది దుండగులు ఆయన మృతికి కారణమయ్యారనే సందేహాలు వ్యక్తమవుతున్నాయని తెలిపారు.

ఆర్ఓబీ నిర్మాణం కోసం ఇళ్లు తొలగింపు



ఎక్స్‌కవేటర్‌లో ఇంటిని కూల్చుతున్న దృశ్యం

పీలేరురూరల్ : పీలేరు పట్టణం ఎల్‌బీఎస్ రోడ్డులో రైల్వే గేటు దగ్గర ఆర్‌వోబీ నిర్మాణ పనులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో రైల్వేగేటు వద్ద ఆర్‌వోబీ పిల్లర్స్ ఏర్పాటుకు అడ్డంగా ఉన్న ఇళ్లను గురువారం ఉదయం పోలీస్ బందోబస్తు మధ్య తొలగించారు. తహసీల్దార్ భీమేశ్వర్‌రావు, సీఐ యుగంధర్, ఎన్‌హెచ్ అధికారుల పర్యవేక్షణలో తొలగింపు కార్యక్రమం చేపట్టారు. మిగిలిన ఇళ్లు ఈ నెలాఖరుకల్లా ఇళ్ల యజమానులు స్వచ్ఛందంగా తొలగించుకోవాలని, లేనిపక్షంలో పూర్తి స్థాయిలో తొలగించాల్సి వస్తుందని అధికారులు తెలిపారు.

కృత్రిమ మేధ.. అత్యాధునిక పరిశోధనలకు ప్రేరణ

కురబలకోట: కృత్రిమ మేధ అత్యాధునిక పరిశోధనల అన్వేషణకు ప్రేరణగా నిలుస్తోందని బెంగళూరులోని క్రాసిక్ టెక్నాలజీస్ అసోషియేట్ డైరెక్టర్ డాక్టర్ కుమార్ రాజమణి అన్నారు. అంగళ్లు మిట్స్ ఇంజినీరింగ్ కళాశాలలో డీప్ లర్నింగ్ (ఎఐ)ఇన్ అగ్రిటెక్ అండ్ హెల్త్‌కేర్ అంశంపై గురువారం సెమినార్ నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడుతూ ఆరోగ్య సంరక్షణ, వ్యవసాయం తదితర రంగాల్లో ఏఐతో పనులు సులభతరం అవుతున్నాయన్నారు. పెట్టుబడి ఖర్చులు తగ్గుతాయన్నారు. వ్యవసాయ రంగంలో ఉత్పత్తిని మెరుగుపరచి దిగుబడులు పెంచుకోవచ్చన్నారు. టెక్నాలజీ రంగంలో వినూత్న మార్పులు చోటుచేసుకుంటున్నాయని, విద్యార్థులు లోతైన పరిశోధనలు చేయాలని సూచించారు.

ఉపాధి హామీ ఏపీఓగా చెన్నకేశవ

మదనపల్లె : మదనపల్లి మండల ఉపాధి హామీ ఏపీఓగా పి. చెన్నకేశవ గురువారం స్థానిక ఉపాధి హామీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కలకడ మండలంలో పనిచేస్తున్న ఆయన బదిలీపై మదనపల్లికు వచ్చారు. అంతకుముందు మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీఓ తాజ్ మసురూర్‌ను కలిసి జాయినింగ్ రిపోర్ట్ అందజేశారు. ఆయనతోపాటు నిమ్మనపల్లె నుంచి బోయకొండప్ప, రామసముద్రం నుంచి చిన్నప్ప, టెక్నికల్ అసిస్టెంట్లుగా, పేటీఎం నుంచి శివకుమార్ కంప్యూటర్ ఆపరేటర్ గా విధులలో చేరారు.

తంబళ్లపల్లె: మండలం ఉపాధిహామీ ఇంజినీర్‌గా మహేష్‌బాబు బాధ్యతలు చేపట్టారు. ఈయన పెద్దతిప్పసముద్రం మండలంలో పని చేస్తూ బదిలీపై ఇక్కడికి వచ్చారు. మహేష్‌బాబు మాట్లాడుతూ మండలంలో ఉపాధి పథకంలో కూలీలకు కోరిన వెంటనే పనులు చూపడం, జరిగిన పనులకు కొలతలు తీసి సకాలంలో బిల్లులు చెల్లించేందుకు కృషి చేస్తానన్నారు. ఉపాధి పనుల్లో అధికంగా కూలీలు పాల్గొనే విధంగా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు.

న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి



బీసీ పురుషోత్తంరెడ్డి

పీలేరురూరల్: న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బీసీ పురుషోత్తంరెడ్డి తెలిపారు. పీలేరు న్యాయవాదుల సంఘం (బార్ అసోసియేషన్) అధ్యక్షుడిగా బి.సి. పురుషోత్తంరెడ్డి ఎన్నికయ్యారు. గురువారం స్థానిక కోర్టు ఆవరణలో బార్ అసోసియేషన్ ఎన్నికలు నిర్వహించారు. 76 మంది సభ్యులుగా ఉండగా, 74 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష పదవికి బీసీ పురుషోత్తంరెడ్డి 45 ఓట్లు సాధించి గెలుపొందారు. ప్రధాన కార్యదర్శిగా ఆర్. చంద్రశేఖర్ 46 ఓట్లతో విజయం సాధించారు. ఉపాధ్యక్షుడిగా రామస్వామిరెడ్డి ఎన్నికయ్యారు.